విజయక్రాంతి
VOICE OF TELANGANA

## మెట్రో హైదరాబాద్

# మెట్రో ఫేజ్–2 పనులు వేగవంతం

- జాతీయ రహదారుల అధికారులతో మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి సమావేశం
- ప్రతిపాదిత రూట్లలో స్టేషన్ల ఏర్పాటు, పనులపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 10 (విజయక్రాంతి): మెట్రో ఫేజ్–2 పనుల కోసం మియాపూర్–పటాన్‌చెరు, ఎల్బీనగర్–హయత్‌నగర్ కారిడార్లను హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్.రెడ్డి ఇంజనీరింగ్ నిపుణులతో కలిసి బుధవారం పరిశీలించారు. జాతీయ రహదారులపై ఉన్న మైలార్‌దేవ్‌పల్లి–ఆరామ్‌ఘర్–కొత్త హైకోర్టు స్పర్‌లైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ రూట్లలోని పాత, కొత్త ఫ్లై ఓవర్ల కారణంగా ఫేజ్ 2 పనులకు ఎదురయ్యే ఇంజనీరింగ్ సవాళ్లను పరిష్కరించే అంశాలపై ఆయన బుధవారం రసూల్‌పురలోని మెట్రో రైలు భవన్‌లో జాతీయ రహదారుల అధికారులతో సమావేశమయ్యారు.

**ప్రతిపాదనకు వచ్చిన అంశాలు..**

- ఎల్బీనగర్–హయత్‌నగర్ మెట్రో ఫేజ్–2 కారిడార్‌ను జీహెచ్ఎంసీకి చెందిన ప్రస్తుత 2 ఫ్లై ఓవర్ల మధ్య ఎల్‌బీనగర్ జంక్షన్ వద్ద ఉన్న మెట్రో వయాడక్ట్‌కు పొడిగించి నిర్మిస్తారు. చింతలకుంట నుంచి హయత్‌నగర్ వరకు, ఎన్‌హెచ్ఏ అధికారులు 4 కొత్త ఫ్లైఓవర్లను నిర్మిస్తున్నందున మెట్రో అలైన్ మెంట్ ఎడమవైపు సర్వీస్ రోడ్డులో ఉంటుంది.
- నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్లు, మెట్రోరైల్ పిల్లర్లు, వయాడక్ట్, స్టేషన్ల ఇంజనీరింగ్ డ్రాయింగ్‌లు వైమధ్యాలకు అవకాశం ఇవ్వకుండా నివారించడానికి ఇరువైపులా అధికారులు సమన్వయం చేసుకుంటున్నారు. ఈ కారిడార్‌లో ప్రతిపాదించిన 6 మెట్రో స్టేషన్లలో కొన్నింటిని ఫ్లైఓవర్ల మీదుగా ఎన్‌హెచ్‌లకు ఆటంకం లేకుండా సులభంగా యాక్సెస్ చేసే విధంగా ప్రణాళిక రచిస్తున్నారు.
- మియాపూర్ – పటాన్‌చెరు మెట్రో కారిడార్‌ను ఎన్‌హెచ్ సెంట్రల్ మీడియన్‌లో మెట్రో వయాడక్ట్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు. గంగారం వద్ద 1.2కిమీ పొడవైన ఫ్లైఓవర్‌ను హెచ్ఏఎంఎల్, ఎన్‌హెచ్ ఇంజనీర్లు సంయుక్తంగా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ కమ్ మెట్రో వయాడక్ట్‌ను నిర్మించే సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. కాగా.. ఈ స్ట్రెచ్‌లో కుడి వైపున ఓ మతపరమైన కట్టడం ఉండటం వలన ఈ ప్రతిపాదన జరిగింది.
- బీహెచ్ఈఎల్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న అండర్ గ్రౌండ్ ఫ్లైఓవర్ వద్ద ఎడమ వైపునకు మెట్రో అలైన్‌మెంట్ ఉంటుంది. బీహెచ్ఈఎల్ జంక్షన్ వద్ద ఉన్న టీజీ ఎస్ఆర్టీసీ బస్టాప్‌తో బీహెచ్ఈఎల్ మెట్రో స్టేషన్ అనుసంధానం అవుతుంది.
- నాగోల్ – ఎల్‌బీనగర్– శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్‌కు స్పర్‌లైన్‌గా నిర్మించే మైలార్‌దేవ్‌పల్లి జంక్షన్–కొత్త హైకోర్టు స్పర్‌లైన్‌లో పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేకి ఎడమవైపున అలైన్‌మెంట్ ఉంటుంది. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే, అగ్రికల్చర్ యూనివర్సిటీ ఫ్లైఓవర్ మధ్య కుడివైపునకు మళ్లుతుంది.

ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ (ఎన్‌హెచ్) ఈఎన్‌సీ గణపతిరెడ్డి, జాతీయ రహదారుల ఎస్ఈ ధర్మారెడ్డి, హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందమోహన్, ఎస్ఈ సాయిపరెడ్డి, జనరల్ మేనేజర్లు రాజేశ్వర్, విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.